

కె.వి.ఆర్. హనుమంతరావు

చెదిరిన జుట్టు, నల్ల కళ్లద్దాలు, పంచకట్టు, చొక్కాపై కోటు, చేతిసంచి, చంకలో గొడుగుతో విశాఖపట్నం వెళ్లే ట్రయిన్ దిగి స్టేషన్‌లోకి వచ్చి బెంచిపై కూర్చున్నాడు ఒక పెద్దమనిషి. ట్రయిన్ వెళ్లిపోయాక చేతిలో ఎర్రజెండా, పచ్చజెండా పట్టుకుని తన రూమ్‌లోకి వెళ్ల బోతూ సడన్‌గా ఆ వ్యక్తి కూర్చున్న బెంచ్ దగ్గ రకు వచ్చిన స్టేషన్ మాష్టారు రామారావు "సార్! మీ టికెట్ చూపిస్తారా?" అన్నాడు.

ఆ పెద్దమనిషి లేచి నిలబడి "లేదు సార్. టికెట్, డబ్బులు ఉన్న పర్సు ఎవరో కొట్టేసారు" అన్నాడు.

"టికెట్ లేని ప్రయాణం చేయడం నేరం అని తెలియదూ? పెద్దవాడివి. ట్రయిన్ దిగి వస్తున్నావ్. టికెట్ అడిగితే ఏదో కథ చెబుతు న్నావ్. సిగ్గువేయడంలేదూ?" అన్నాడు.

"నిజమే చెబుతున్నాను సార్. టికెట్ కొని టికెట్, డబ్బులూ పర్సులో పెట్టి జేబులో వేసుకు న్నాను. జేబు ఎవరో కత్తిరించారు. పర్సుపో యింది. కావాలంటే చూడండి" అంటూ కోటు జేబులో చేయి పెట్టాడు. చేయి ఆ జేబులోంచి మణికట్టు వరకూ బయటకు వచ్చింది.

"ఇలా తలవంచి చెప్పవలసి వచ్చినందుకు నిజంగా సిగ్గుపడుతున్నాను" అన్నాడు ఆ వ్యక్తి.

పెద్దమనిషి! నిజంగానే టికెట్ కొనివుం టాడు. ఎవడో దొంగవెధవ జేబు కొట్టేసాడు. ఆయన చెప్పింది నిజమే అన్పించింది.

"ఎక్కడి నుంచి వస్తున్నారు? ఎక్కడికి వెళ్లాలి?" అన్నాడు మెల్లగా.

నేనూ... నేనూ...

* * *

'దయచేసి వినండి: విశాఖపట్నం వెళ్లే ఎక్స్ ప్రెస్ కొద్దినిమిషాలలో రెండవ నంబరు ప్లాట్ ఫారమ్ నుంచి బయలుదేరుటకు సిద్ధముగా ఉన్నది" అన్న ప్రకటన మూడు భాషలలో విన్పి స్తోంది.

ఆటో దిగి డబ్బులు ఇచ్చి, చేతిసంచి, గొడుగు తీసుకుని గబగబా స్టేషన్‌లోకి వచ్చి, కౌంటర్‌లో విశాఖపట్నం వరకూ టికెట్ తీసు కుని టికెట్, డబ్బులు పర్సులో వేసుకుని రెండవ నంబర్ ప్లాట్‌ఫారమ్ మీదకు వచ్చి జనాన్ని నెట్టుకుంటూ ఎదురుగా ఉన్న బోగీ లోపలికి ప్రవేశించారు రమణయ్యగారు. ఆయన కుమా రుడు శేఖర్ విశాఖపట్నంలో ఎల్.ఐ.సి.లో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. బడికి శలవులు ఇవ్వడంతో కొడుకు వద్దకు వెళ్తున్నాడు చూసి వద్దామని.

అలాగే జనాన్ని రాసుకుంటూ లోపలికి వచ్చారు. ఒక సీటుమీద చోటు చూపిస్తూ తను ప్రక్కకు జరిగి "రండి మాష్టారూ! ఇటువచ్చి కూర్చోండి" అంటూ ఓ పరిచయమైన వ్యక్తి ఆహ్వానించాడు. కృతజ్ఞతలు తెలుపుతూ ఆ చోటులో కూర్చున్నారు రమణయ్యగారు.

ట్రయిన్ విశాఖపట్నంవైపు పరిగెత్తుతోంది. కొంచెం స్థిమితం చిక్కగానే సర్దుకుని కూర్చుని, కళ్లజోడు పెట్టుకుని సంచిలో దినపత్రిక తీసి పేజీలు తిప్పసాగారు. టీ వెండర్స్, తినుబండా రాలు అమ్మేవారు, బూట్‌పాలిష్ కుర్రాళ్లు, బండి లో నిలుచున్న వాళ్లు సీట్లకోసం అటూఇటూ తిరుగుతున్నారు. అందరి దగ్గరా టికెట్స్ చెక్ చేస్తూ 'టికెట్ ప్లీజ్', 'టికెట్ సార్', 'టికెట్! టికెట్!!' అంటూ టికెట్ కలెక్టర్ అందరివద్దా టికెట్‌లు చెక్ చేస్తూ 'టికెట్ సార్' అంటూ రమణయ్యగారు కూర్చున్న సీటు వద్దకు వచ్చి, పక్కవారి టికెట్ చూసి తిరిగి ఇస్తూ 'టికెట్ సార్' అంటూ రమణయ్యగారి వద్ద ఆగాడు.

రమణయ్యగారు పేపరు మడిచి లేచి నిలబడి కోటు జేబులో చేయి పెట్టారు. ఖాళీగా తగి లింది. మరో జేబులో చేయి పెట్టి చూసారు. ఏం కన్పించలా! కంగారుగా అటూ ఇటూ చూస్తూ మరోసారి జేబులన్నీ వెదికారు. కోటు జేబులోంచి చేయి బయటకు వచ్చింది. గుండె గుభేల్‌మంది. 'అయ్యో! జేబునెవరో కత్తిరించారు. టికెట్, డబ్బులు ఉన్న పర్స్ పోయింద'ని పించేసరికి ఆయనలో వణుకు బయలుదేరింది. వళ్లు చెమటలు పట్టాయి. ఎలా ఇపుడు? డబ్బు, టికెట్ ఉన్న పర్సు పోయింది. ఏం చెప్పాలో తెలియక నిలబడిపోయారు రమణయ్యగారు.

టికెట్ కలెక్టర్ "ఏది సార్! టికెట్ చూపించండి! అన్నాడు ఆయనవైపు సూటిగా చూస్తూ.

"లే... లేదు... సార్! పోయింది" అన్నారు గొంతులో తడిఆరిపోతున్నట్లు కాగా.

"ఏం సార్! జోక్ చేస్తున్నారా? టికెట్ పోయిందా?" అన్నాడు కొంచెం హేళనగా.

"లేదు సార్! నిజమే చెబుతున్నాను. టికెట్ కొని డబ్బులు పర్సులో పెట్టి ఇదిగో ఈ కోటు జేబులో వేసుకున్నాను. కావాలంటే చూడండి" అంటూ జేబులో చెయ్యిపెట్టి చూపించాడు. మణికట్టు వరకూ బయటకు వచ్చింది.

"అంత నిర్లక్ష్యమా! టికెట్ జాగ్రత్తగా పెట్టుకోనక్కరలేదా? అడిగితే పోయిందంటారు. ఏవేవో కథలు చెబుతారు. ఇవన్నీ మాకు మామూలే. ఎక్కడో వుంటాయి గానీ డబ్బులు తీయండి" అన్నాడు.

"లేదు సార్. నిజమే చెబుతున్నాను. వేరే డబ్బులు ఏమీ లేవు. అన్నీ ఆ పర్స్‌లోనే ఉన్నాయి సార్" అన్నాడు దీనంగా.

అయ్యో! పాపం... పెద్దవాడు. డబ్బులు పోయాయిట. అందరి చూపులూ అటు తిరిగాయి.

టికెట్ కలెక్టర్ ఎగాదిగా చూసాడు. పెద్ద మనిషి... నిజమే చెబుతున్నాడు. టికెట్, డబ్బు లున్న పర్సు పోయే ఉంటుంది అనిపించింది. "అయితే మీ దగ్గర టికెట్ లేదు, కొనడానికి వేరే డబ్బులు లేవు. ఏం చేద్దాం? కేస్ బుక్ చేస్తే మీరు జైలుకి వెళ్లవలసి వస్తుంది. పెద్దవారు... నిజాయితీ కలవారేనని, టికెట్ నిజంగానే పోయిందని నమ్ముతున్నాను. వదిలేస్తాను... పైన స్క్వాడ్ ఉంది. వాళ్లు పట్టుకుంటే చిక్కుల్లో పడతారు. టికెట్ లేకుండా ప్రయాణం చేయడం నేరం. మీ మంచికే చెబుతున్నాను. పక్క స్టేషన్‌లో దిగిపోండి" అంటూ ప్రక్క బోగీలోకి వెళ్లిపోయాడు టీసీ.

ఉసూరుమంటూ కూలబడ్డాడు రమణయ్య. 'కొత్తచోటు, కొత్తవాళ్లు ఏంచేయాలి? ఎవరిని అడగాలి? వైజాగ్ ఎలా చేరాలి? సెల్‌ఫోన్ లాంటివి అసలే లేవు. కొడుకుల నంబర్లూ గుర్తు లేవు' అని మథనపడుతూండగానే ప్రక్క స్టేషన్‌లో బండి ఆగింది. ఆ టీసీ మరలా రమణయ్యగారి దగ్గరకు వచ్చి "రండి సార్. ఇక్కడ దిగిపోండి" ఎలాగో తరువాత రండి" అంటూ చేయిపట్టి లేపి మరీ రమణయ్యగారిని ఆ స్టేషన్‌లో దించేసాడు. బండి వెళ్లిపోయింది" – ఇదిగో ఈ బెంచిమీద ఇలా కూర్చున్నాను. ఈ ఊరు నాకు కొత్త. ఎవరూ తెలియదు. విశాఖపట్నం ఎలా వెళ్లాలో, ఇపుడేం చేయాలో తెలియడం లేదు" అన్నారు ఆందోళనతో తలవంచుకుని.

"మీరు విశాఖపట్నం వెళ్లాలా? అక్కడ ఎవరున్నారు?" అంటూ రమణయ్యగారి వైపు పరిశీలనగా చూసాడు. గుర్తొచ్చింది... "ఓహో! మా రమణయ్య మాష్టారు కదూ. చాలాకాలమైంది

చూసి. తను హైస్కూల్లో చదువుతుండగా... ఆనందం కల్గింది. తెప్పరిల్లి "మాష్టారూ! మీరా! నమస్కారం సార్" అన్నాడు చేతులు జోడిస్తూ స్టేషన్ మాష్టారు.

ఆ మాటలు చెవులకు కమ్మని విందుగా తోచాయి రమణయ్యగారికి. ఎవరా అని వెనక్కి తిరిగి చూసాడు. ఎవరూ లేరు. తను, స్టేషన్ మాష్టారూ... ఇద్దరే. ఆయనలోని టీచర్ తొంగి చూసాడు. "ఎవరూ బాబూ!" అంటూ స్టేషన్ మాష్టారు కళ్లలోకి చూసాడు.

"నేను సార్. రామారావుని. మీ రామూని సార్. మాది రమణాలపాలెం. చిన్నప్పుడు మీ వద్ద చదువుకున్నాను. మీ అబ్బాయిలు శేఖర్, రాజాలతో కలిసిమెలిసి ఉండేవాడిని. మీరు లెక్కలు, ఇంగ్లీష్ బాగా చెప్పేవారు. మీ దయ వల్ల బాగా చదువుకుని ఇక్కడ స్టేషన్ మాష్టారుగా ఉద్యోగం చేస్తున్నాను. చాలా కాలమైంది మిమ్మల్ని చూసి. రండి... అలా మా ఇంటికెళ్లి మాట్లాడుకుందాం" అంటూ రమణయ్యగారిని వెంటబెట్టుకుని తన క్వార్టర్‌కి తీసుకువెళ్లాడు.

ఇంటికెళ్లగానే తన భార్య రజనికి పరచయం చేస్తూ "రజనీ! మా మాష్టారు. మా ఊరిలో హైస్కూలులో పనిచేసారు. వారి వద్దనే చదువుకున్నా నేను" అన్నాడు గుక్క తిప్పుకోకుండా.

రజని "రండి మాష్టారూ!" అంటూ రెండు చేతులూ జోడించింది వినయంగా.

"మాట్లాడుకుంటూ ఉండండి. కాఫీ తెస్తాను" అంటూ లోపలికి వెళ్లింది.

గురువుగారిని కుర్చీలో కూర్చుండబెట్టి తను ఎదురుగా కూర్చుంటూ "ఇప్పుడు చెప్పండి మాష్టారూ! ఏమిటి విశేషాలు... శేఖర్, రాజా ఏం చేస్తున్నారు? అంటూ కుశల ప్రశ్నలు వేసాడు.

రమణయ్యగారికి రామూ ఎవరో అప్పటికి గుర్తొచ్చింది. వీడు రమణాలపాలెం సర్పంచ్ కొడుకు రామూ. తన స్టూడెంట్...

"ఓ రామూ! నువ్వా... చాలాకాలమైందిరా నిన్ను చూసి. పెద్దవాడిని అయిపోయాను కదూ! గుర్తుపట్టలా. బావున్నావుటరా! నా ఆరోగ్యం బాగానే ఉంటోంది. రమణాలపాలెంలోనే ఉంటున్నాను నేను. మా శేఖర్ వైజాగ్‌లో ఎల్.ఐ.సి.లో బ్రాంచ్ మేనేజర్‌గా చేస్తున్నాడు. వాడికి ఒక బాబు. రాజా మద్రాస్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. వాడికింకా పెళ్లికాలేదు. మనవణ్ని చూద్దామని వైజాగ్ బయలుదేరి వెళ్తున్నాను. ఇక్కడ దిగాను. ఈ రకంగా నిన్ను చూసాను. చాలా సంతోషంగా ఉంది బాబూ" అన్నారు.

"బాగుంది సార్. చాలా కాలానికి చిన్ననాటి మాష్టారిని చూసాను. ఈ రాత్రి వైజాగ్‌కి మరో ట్రైన్ ఉంది. దానికి ఎక్కిస్తాను. వెళుదురుగాని. భోంచేసి కాసేపు విశ్రాంతి తీసుకోండి. నేను డ్యూటీ పూర్తిచేసుకుని వస్తాను" అంటూ వెళ్లిపోయాడు రామారావు.

డ్యూటీ నుంచి తిరిగివచ్చి భోజనాలు అయిన తరువాత రమణయ్యగారిని తీసుకుని స్టేషనుకు వచ్చి టికెట్ కొని ఇచ్చి, కొంత డబ్బు కూడా ఇచ్చి, బండి ఎక్కించి "జాగ్రత్త మాష్టారూ. టికెట్, డబ్బులు జాగ్రత్తగా పెట్టుకోండి" అన్నాడు.

"అలాగే బాబూ... వెళ్లగానే నీ డబ్బు నీకు పంపిస్తాను" అన్నారు రమణయ్యగారు.

"భలేవారే మాష్టారూ! మా గురువుగారికి అంతమాత్రం చేయలేనా? గురుదక్షిణ ఇచ్చాను. ఉంచుకోండి" అన్నాడు నవ్వుతూ.